క్లుప్తంగా

జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004వ సంవత్సరం వరకు ఉద్యోగం పొందిన సిబ్బందికి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ జీపీఎఫ్ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏలూరులో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సిబ్బంది డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభాకర్ హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు పి.శ్రీనివాస్, కె.కృష్ణకుమార్, వై.శ్రీనివాస్ తదితరులున్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

ఏలూరు (టూటౌన్) : ఆహారపు అలవాట్లలో మార్పు వల్లే క్యాన్సర్ వ్యాధి వ్యాపిస్తోందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఆశ్రం హాస్పిటల్ సౌజన్యంతో సోమవారం ఉదయం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును వారు ప్రారంభించారు. శానిటేషన్ సిబ్బందికి ఆశ్రం సీఓఓ రాజరాజన్ ఆధ్వర్యంలో డాక్టర్లు హేమా నళిని, డీవీ సాయి షణ్ముఖ గౌతమ్, సుప్రియ స్పందన, హరిత బృందం పరీక్షలు నిర్వహించారు. ఆశ్రం మేనేజర్ భాను ప్రదీప్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. కమిషనర్ ఎ.భాను ప్రతాప్, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, పాము శామ్యూల్, ఉచ్చుల సన్నీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ సీనియర్ మేనేజర్‌గా రాజయోగి



జీసీసీ సీనియర్ మేనేజర్ రాజయోగి

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్ పురం గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సీనియర్ మేనేజర్‌గా చెరుకూరి రాజయోగి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదే కార్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న రాజయోగి ఇటీవల సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందడంతో జీసీసీ సీనియర్ మేనేజర్‌గా బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకూ రంపచోడవరం ఈఎంగా పని చేస్తున్న పార్వతీశ్వరరావు కేఆర్‌పురం జీసీసీ ఇన్‌చార్జి సీనియర్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజయోగి మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులను ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా కృషి చేస్తామని చెప్పారు.

కాలువలు కాదు రోడ్లే!

- కొద్దిపాటి వర్షానికే ఏలూరు వీధులన్నీ జలమయం
- రోజుల తరబడి నిల్వ ఉంటున్న నీరు
- నగరవాసులకు తప్పని తిప్పలు
- నీరు బయటకెళ్లేందుకు చర్యలు చేపట్టని అధికారులు



నరసింహరావుపేటలో ఎన్ఆర్ఐ కళాశాల సమీపంలో రోడ్డు దుస్థితి



శ్రీ లక్ష్మీ నగర్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డు



డాక్టర్ జగన్‌మోహన్‌రావు వీధిలో నిలిచిన నీరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరానికి ఆ పేరు ఎలా వచ్చిందని అడిగితే చుట్టూ ఏరులు ఉండడంతో వచ్చిందని చెబుతారు. ఏరులూరు కాస్తా ఏలూరు అయిందంటారు. తమ్మిలేరు నగరం చుట్టూ ప్రవహిస్తుండడంతో నగర ప్రజలకు ఆహ్లాదకరంగానే ఉంటుంది. అయితే వర్షాకాలం వచ్చిందంటే వరదల భయం వెంటాడుతుంది. తమ్మిలేరు ఏటిగట్టుకు రివిట్‌మెంట్ కట్టడంతో వరదల భయం పోయినా ఇప్పుడు నగర ప్రజలను మరో భయం వెంటాడుతోంది. కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ ఏరులుగా మారిపోతున్నాయి. వీధుల్లో నడిచి వెళ్లే పరిస్థితి కనిపించడంలేదు. వాహనాలపై వెళితే ఇంజిన్లలోకి బురద నీరు చేరి మరమ్మతులకు గురవుతున్నాయి.

వీధులన్నీ జలమయం

ఏ కొద్దిపాటి వర్షం కురిసినా నగరంలోని వీధులన్నీ నీటితో నిండిపోతున్నాయి. ఇళ్ల ముందు డ్రెయిన్లపై సప్టాలు ఏర్పాటుచేయడంతో నీరు ముందుకు పారక ముంపు సమస్య తలెత్తుతుందని చెబుతున్నారు. ఈ సప్టాలకు మధ్యలో లేదా ఒకవైపు డ్రెయినేజీలో నీరు ప్రవహించేలా ఏర్పాటు చేస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేదికాదంటున్నారు. ప్రతి ఒక్కరూ తమ వాహనాల పార్కింగ్ నిమిత్తమో లేక తమ నివాసాల వద్ద మట్టి లేకుండా ఉండేందుకో ఈ సప్టాలు నిర్మించుకోవడం వల్ల వర్షం నీరు ఎటూ కదలకుండా ఒకే చోట నిల్వ ఉండిపోతుంది.

విజృంభిస్తున్న దోమలు

ప్రస్తుతం ప్రతి రోజూ మబ్బులు కమ్ముకుంటున్నాయి. అప్పుడప్పుడూ భారీ వర్షం కురుస్తూ కొన్ని గంటల పాటు జనజీవనాన్ని స్తంభింపజేస్తుంది. ఈ క్రమంలో గత మూడు రోజుల క్రితం నగరంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి వీధులన్నీ నీటితో నిండిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీల ద్వారా నీరు ప్రవహించే మార్గం లేక వీధుల్లోనే నిలిచిపోయింది. ఆ నీరు ఇప్పటికీ అలాగే ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల పుట్టుకొస్తున్నాయి. ఎండలు తీవ్రంగా ఉన్నా నీరు కనీసం భూమిలోకి ఇంకకుండా మురుగుగా మారిపోతే వచ్చే వర్షాకాలంలో వర్షం కురిస్తే తమ పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ మారే ప్రతీ సారీ అంటువ్యాధులు, అనారోగ్యాలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. రుతుపవనాలు మరో మూడు రోజుల్లో కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటిస్తుండడంతో ఈ ఏడాది వర్షాకాలం కొద్దిగా ముందుగానే వచ్చే సూచనలున్నాయి.

నీరు పారేలా చర్యలు తీసుకోవాలి



ఇటీవల కురిసిన వర్షాలకే నీరు రోడ్లపై నిలిచిపోయి ఉంది. మూడు రోజుల క్రితం కురిసిన వర్షం నీరు ఇంకా పోలేదు. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాలు ప్రారంభమైతే వాన నీరు దిగువకు పారే మార్గంలేదు. వర్షం నీటిలో నడవలేని పరిస్థితి తలెత్తుతుంది. వెంటనే నీరు నిలవకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– గొంతిన రామకృష్ణ, సామాజిక కార్యకర్త

వ్యాధుల భయం



వర్షం నీరు రోడ్లపై నిల్వ ఉండి మురుగు నీరుగా మారుతుంది. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయింది. ఈ నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. జ్వరాలు ప్రబలుతాయని భయంగా ఉంది. మా ప్రాంతంలో ఎక్కువ మంది వృద్ధులు, చిన్నపిల్లలు ఉన్నారు. అంటువ్యాధులు వస్తే ఊరం తాపాకే ప్రమాదం ఉంది.

– చిట్టి వెంకటలక్ష్మి, స్థానిక గృహిణి

డివిజనల్ కమాండర్‌గా ఏసు రాజ్యం



ప్రార్థన చేస్తున్న విశ్వాసులు

దెందులూరు: జిల్లా సాల్వేషన్ డివిజనల్ కమాండర్‌గా ఏసు రాజ్యం లత దంపతులు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కమాండర్లు యాకూబ్ మసి, సుమిత్రా మసి ముఖ్య అతిథులుగా హాజరై డివిజనల్ కమాండర్ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఏసు రాజ్యం తొలి వర్తమానాన్ని అందజేశారు. రిటైర్డ్ కల్నల్ జోషి దెందులూరు కోర్ ఆఫీసర్ కాకి రమణయ్య, కొవ్వలి కోర్ ఆఫీసర్ కె.సుబ్బారావులతోపాటు రాష్ట్రంలోని సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్లు, సంఘ పెద్దలు, సంఘస్తులు, గృహ సమితి సభ్యులు యువత పాల్గొన్నారు. డివిజనల్ కమాండర్ దంపతులను జిల్లా కోర్ ఆఫీసర్లు సంఘ పెద్దలు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

22న వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం: పలు నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 22న బహిరంగ వేలం వేస్తున్నట్లు చింతలపూడి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10 గంటలకు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వాహనాల వేలం ఉంటుందన్నారు. గూడ్స్ ఆటో, ఫోర్డ్ కారు, మోటార్ సైకిళ్లు, మోపెడ్ వాహనాలు వేలం వేస్తున్నామని తెలిపారు.

గణితంతో మేధస్సుకు పదును



గణితంపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణితంలో మెళకువలను నేర్చుకోవడం ద్వారా మేధస్సు మరింత పెరిగి విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని రిసోర్స్ పర్సన్ కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లాకేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 18వ రోజు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ శిక్షణ తరగతుల్లో చిన్నారులు ఎంతోహుషారుగా పాల్గొంటున్నారు. ఉదయం గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు చదవడం మాకిష్టంలో భాగంగా నీతి కథలను చదివించి, వారితో కథలు చెప్పించారు. ఈ సందర్భంగా సోమరిపోతు నెమలి – ఒక వ్యాపారి అనే నీతి కథలను బోధిస్తు జీవితంలో ఎప్పుడూ సోమరితనంగా, బద్ధకంగా ఉండ కూడదని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని విజ్ఞానంతో కూడిన సందేశాన్నిచ్చారు. అనంతరం రిసోర్స్ పర్సన్ వై.ఫణికాంత్ విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ కొనసాగించారు. ఈ శిక్షణలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్‌కుమార్, ఎండీ అస్లాం పాషా, బీవీఎస్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు వన్ టౌన్లో అత్త నోట్లో బలవంతంగా పురుగుల మందు పోసి హత్యాయత్నం చేసిన అల్లుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు నల్లదిబ్బ ప్రాంతానికి చెందిన సజ్జా వెంకటలక్ష్మి కుమార్తెను కట్టా రాజేష్ (21)కి ఇచ్చి వివాహం చేయగా, కొంతకాలం హైదరాబాద్‌లో ఉన్నాడు. వెంకటలక్ష్మి కుమార్తెను అల్లుడు చిత్రహింసలకు గురి చేయడంతో తన కుమార్తె ఏలూరు పుట్టింటికి వచ్చేసింది. రాజేష్ ఇటీవల ఏలూరు వచ్చి ఈనెల 17న భార్యతో గొడవ పెట్టుకుని కొడుతున్నాడు. తన కుమార్తెను కొట్టవద్దు అంటూ ప్రశ్నించిన వెంకటలక్ష్మి నోటిలో పురుగుమందు పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి రాజేష్ను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చారు. న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అతడ్ని పోలీసులు జిల్లా జైలుకు తరలించామని ఎస్సై నాగబాబు తెలిపారు.

దేశం గర్వించదగ్గ నేత సుందరయ్య



వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు (టూటౌన్): దేశం గర్వించదగ్గ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పార్లమెంటు తొలి ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ స్థానిక గానుగులపేట సుందరయ్య గ్రంథాలయం వద్ద సోమవారం గ్రంథాలయం నిర్వాహకుడు కంది విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదర్భంగా రవి మాట్లాడుతూ దేశం, రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాలు అవలంబించాల్సిన విధానాలను 1950 కాలంలోనే స్పష్టంగా చెప్పిన దార్శనికుడు సుందరయ్య అని కొనియాడారు. సుందరయ్య స్ఫూర్తితో ఈ తరం పనిచేయాలని సూచించారు. పార్టీ నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుడిపాటి నరసింహారావు ప్రారంభించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం కమిటీ సభ్యులు ఎం ఇస్సాకు, బలరాం, నాగేంద్ర, సీపీఎం నాయకులు వైఎస్ కనకారావు, కోటేశ్వరరావు, జి.రవి కిషోర్, కె.రామాంజనేయులు, అరుణ కుమారి, వీవీఎస్ ప్రసాద్, జె.గోపి తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఏవిఆర్ విజ్ఞాన కేంద్రంలో..

భవిష్యత్తు తరాలు బాగు కోసం తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య మహోన్నతుడని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో సుందరయ్య చిత్రపటానికి రిటైర్డ్ టీచర్ కేవీ నారాయణరావు పూలమాల వేశారు. స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనింగ్ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులు సుందరయ్యకు జోహార్లర్పించారు.

సీపీఎం జిల్లా కార్యాలయంలో..

కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి, వియత్నాం విప్లవకారుడు, రాజకీయ నాయకుడు కామ్రేడ్ హోచి మిన్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, హోచి మిన్ చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుడిపాటి నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి డీఎన్‌వీడీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. నాయకులు శ్యామలారాణి, రామాంజనేయులు, కనకరావు, గోపి, కోటేశ్వరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు

వేలేరుపాడు: మండలంలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జీవో నంబర్ 3 గురించి రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్ష చేస్తున్న వారికి మద్దతుగా మండల కమిటీ నాయకులు సంఘీబావం తెలిపి మాట్లాడారు. మండలంలోని ఏఎస్పీ అధ్యక్షుడు సోడా సీతారామయ్య మాట్లాడుతూ జీవో నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీ డీఎస్సీని తక్షణమే ప్రకటించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ క్లియర్‌రైన వారిని పునరావాసాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో ఉయిక ముత్యాలరావు, సీహెచ్ రామకృష్ణ, కణితి లక్ష్మణ్, పైదా శేఖర్, పూనేం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విజయ కేతనం



ఉపాధ్యాయులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సీబీఎస్ఈ బోర్డు 10వ తరగతి, ప్లస్–2 పరీక్షా ఫలితాల్లో స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్ తెలిపారు. వీరిని సోమవారం స్కూల్‌లో అభినందించారు. ప్లస్–2 విద్యార్థి ఎస్.ఆశ్రిత్‌రామ్, పదో తరగతి విద్యార్థి లక్షిత, వివిధ సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు సాధించిన మరో 10 మందికి, ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం నగదు బహుమతులు ఇచ్చి సత్కరించింది. అనంతరం ఎన్‌సీసీ పాయింట్ 22 సెమి లేటర్ ఫైరింగ్ రూమ్‌ను అతిథులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్ రెడ్డి విద్యాసంస్థల ప్రెసిడెంట్ అల్లూరి ఇంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ వీవీ బాలకృష్ణారావు, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలు వల్లభనేని శ్రీకృష్ణ, కొడాలి సుబ్బారావు, ట్రెజరర్ చిట్టూరి జానకి రామయ్య, ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ మల్లిబాబు, బీఈడీ కాలేజ్ కరస్పాండెంట్ కిలారు ప్రభకరరావు, సీఆర్ రెడ్డి పాఠశాల కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	18
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	38	బీన్షచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	58
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

పొగాకు బ్యారన్ దగ్ధం



ఊటసముద్రంలో దగ్ధమవుతున్న బ్యారన్

చింతలపూడి: మండలంలోని ఊట సముద్రంలో గ్రామ సర్పంచ్ కాకాని రాంబాబుకు చెందిన పొగాకు బ్యారన్ సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బ్యారన్ లోపల ఉన్న జామాయిల్ కర్రకు నిప్పు అంటుకొని బ్యారన్ తగలబడినట్లు భావిస్తున్నారు. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు రాంబాబు తెలిపారు.

శ్రీవారి స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ విమాన గోపుర స్వర్ణమయ పతకానికి తాడేపల్లిగూడెంలోని వానపల్లికి చెందిన ఇలపోలు సుశీల సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. తొలేత ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్‌ను అందజేశారు.

రేపటి నుంచి మద్దిలో కల్యాణోత్సవాలు



గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి హనుమద్ జయంతి సహిత కల్యాణ మహోత్సవాలు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సోమవారం కార్యక్రమాల వివరాలను ఆమె వెల్లడించారు. 21వ తేదీ ఉదయం ప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. నిత్యకైంకర్యాలతో పాటు నిజరూప దర్శనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురారోపణం, వాస్తుపూజ, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ గురువారం నిత్య కైంకర్యాలతో పాటు హనుమద్ జయంతి సందర్భంగా స్వామి వారి లక్ష తమలపాకులతో పూజ, నిత్యహోమం, బలిహరణలు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 23వ తేదీ సువర్చలా హనుమద్ కల్యాణం, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 24వ తేదీ నిత్యపూజలతో పాటు ఉపాలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ నిత్యపూజలతో పాటు మహా పూర్ణాహుతి, దీక్ష విరమణ, స్వామి వారికి అభిషేకం, ధ్వజావరోహణ, చక్రస్నానం, సాయంత్రం 7 గంటలకు తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు.

ఆసుపత్రి పనులు పునఃప్రారంభించాలి

టి.నరసాపురం: బొర్రంపాలెం పీహెచ్‌సీ పనులు పునఃప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పీహెచ్‌సీ భవనం శిథిలావస్థలోకి చేరడంతో నాటి ఎంపీ కావూరి సాంబశివరావుకు వినతిపత్రం ఇచ్చామని, దీంతో భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని సామాజిక కార్యకర్త గుండె పాండురంగ తెలిపారు. స్థల సేకరణ, ఇతర కారణాలతో ఆసుపత్రి నిర్మాణం జాప్యమైందన్నారు. స్థల సేకరణ చేసి, ఆసుపత్రి నిర్మాణం చేపట్టి అర్థాంతరంగా పనులు ఆపేశారు. నాటి నుంచి నేటి వరకు ఆసుపత్రి నిర్మాణం జరగలేదన్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్‌ని కోరినట్లు పాండురంగ తెలిపారు.

ఘనంగా ముగిసిన మరియ మాత ఉత్సవాలు



ఎడ్ల బండిపై ఊరేగుతున్న మరియ మాత

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు పెదలింగంపాడు గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మరియమాత మహోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఆలయంలో విచారణ గురువులు ఫింటో థామస్ ఆధ్వర్యంలో రెవరెండ్ ఫాదర్స్ టోని, నెల్సన్ జాన్, జింటో, జిజో ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అలంకరించిన ఎడ్ల బండిపై మరియమాత విగ్రహాన్ని ఉంచి గ్రామంలో రంగుల జల్లుకుంటూ ఊరేగించారు. గ్రామస్తులు మరియమాతకు పూజలు చేశారు.